ప్రజాశక్తి
సోమవారం 12 జూన్ 2023



సైబీరియా అతిథులొచ్చాయి..

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చల్లమనాడేవలస గ్రామానికి సైబీరియా వలస పక్షులు వచ్చేశాయి ఈ వలస పక్షులు రాకతో రుతుపవనాలు వస్తాయని, వర్షాలు సకాలంలో వస్తాయని గ్రామస్తులు నమ్మకం. ఎన్నో ఏళ్లుగా ఈ గ్రామానికి ఈ వలస పక్షులు జూన్ రెండో వారంలో వచ్చి నవంబర్ చివరి నాటికి మళ్లీ వెళ్ళిపోతాయి. వీటికి రక్షణగా గ్రామస్తులు రక్షణగా ఉంటారు. అలాగే గతంలో అటవీశాఖ అధికారులు టూరిస్ట్ కేంద్రంగా అభివృద్ధికి సర్వేలు జరిపారని కానీ ఇంతవరకు ఒక్క అడుగు ముందుకు వేయలేదేని గ్రామస్తులు అంటున్నారు. ఈ కేంద్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే బాగుంటుందని అప్పటి జిల్లా అధికారులు నివేదికలు ఇచ్చినప్పటికీ ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్లలేదు. ఇప్పటికైనా దీనిపై దృష్టి పెట్టి ముందుకెళ్లేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంగన్నదొరవలసలో ఇంకా ప్రారంభం కాని పనులు

అసౌకర్యాల నడుమ మోగనున్న బడిగంట

- నేటి నుంచి బడులు ప్రారంభం
- అసంపూర్తిగా నాడు-నేడు పనులు
- సమస్యలతో స్వాగతం పలుకుతున్న పాఠశాలలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

వేసవి సెలవులు ముగియడంతో సోమవారం నుంచి పాఠశాలల్లో బడిగంట మోగనుంది. 42 రోజుల తర్వాత పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. పాఠశాలలు ప్రారంభానికి జిల్లా విద్యాశాఖాధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. తరగతి గదులు, తాగునీటి, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు కల్పించి, సర్వం చేస్తున్నారు. మరోవైపు అసంపూర్తిగా నాడు-నాడు పనులు ఉండటంతో మరికొద్దిరోజులు విద్యార్థులకు పాట్లు తప్పేలా కనిపించడం లేదు.

జిల్లాలో 699 పాఠశాలల్లో సుమారు లక్షా ఇరవై వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 97,761 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో, 22338 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. జిల్లాలో మొత్తం 59046 మంది బాలికలు,61103 మంది బాలులు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. వీరితో పాటుగా ఈ ఏడాది సుమారుగా 15 వేల మంది విద్యార్థుల వరకు కొత్తగా పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నట్లుగా అధికార యంత్రాంగం అంచనా. గడిచిన సంవత్సరంలో ఫలితాలు మెరుగ్గా ఉన్నప్పటికీ కొన్నిచోట్ల లోటుపాట్లు ఉన్న మాట వాస్తవం. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రెండు దశల్లో ఎంపిక చేసినా పాఠశాలలో మౌలిక వసతుల రూపకల్పన ద్వారా అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ నేటికీ చాలా పాఠశాలలో కనీసం మరుగుదొడ్లు లేక, భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో విద్యార్థులు నానా అవస్థలకు గురవుతున్నారు. ఇప్పటికే మన్యం ప్రాంతంలో చాలామంది గిరిజన విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. విద్యాశాఖ అధికారులు వారిపై దృష్టి సారించి వారి సమస్యలను గుర్తించి ఆయా విద్యార్థులందర్నీ బడిలో చేర్పించి మన్యం ప్రాంతంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే ప్రభుత్వం విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుక కిట్లను సిద్ధం చేసి, పాఠ్యపుస్తకాలను విద్యార్థులు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గత సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో మన్యం జిల్లా రాష్ట్రంలోని మొదటి స్థానం సాధించిన నేపథ్యంలో ఈ సంవత్సరం కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని లక్ష్యంతో నూతన ఉత్సాహంతో అడుగులు ముందుకు వేస్తుంది.

నేటి నుంచి 17 వరకు ఒంటి పూట బడులు

పాఠశాలలు ఈ నెల 12 నుండి 17 వరకు ఒంటి పూట పనిచేస్తాయని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఉదయం 7.30 గంటల నుండి 11.30 గంటల వరకు పాఠశాలలు పనిచేస్తాయని చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఒంటి పూట బడుల నిర్వహణపై పాఠశాల కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, ఇతర యాజమాన్యాల కింద పనిచేస్తున్న అన్ని పాఠశాలలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని ఆయన పేర్కొన్నారు. రానున్న నాలుగు, ఐదు రోజుల వరకు ఎండల తీవ్రత 40 డిగ్రీలపైన ఉండవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ప్రభుత్వం సమయాలను ప్రస్తుతం మార్పు చేసిందన్నారు. ఈనెల 19 నుంచి యథాతథంగా పాఠశాలలు పనిచేస్తాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఉదయం 7.30 గంటలకు పాఠశాలలు ప్రారంభం అవుతుందని, 8.30 గంటల నుంచి 9 గంటల వరకు రాగి జావ సరఫరా చేస్తారని, 11.30 గంటల నుండి 12 గంటలలోగా మధ్యాహ్న భోజనం ముగిస్తామని వివరించారు.

కబ్జాదారులపై చర్యలేవీ

ఆర్‌డిఒ ఆదేశాలు బేఖాతరు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కరాసువలస పంచాయతీ దత్తివలస రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ చెరువుల కబ్జాలపై విచారణ ఒక్క అంగుళం కూడా ముందుకు పడలేదు. గత నెల 17న పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలత ఆధ్వర్యాన చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణపై దత్తివలసలో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులైన గిరిజన సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలతో ఆర్‌డిఒ గ్రామసభ నిర్వహించారు. భూముల ఆక్రమణ, ప్రభుత్వ చెరువుల కబ్జాలపై 15రోజుల్లో విచారణ జరిపి నివేదిక పంపించాలని అప్పటి తహశీల్దార్ రామస్వామి, విఆర్వో వెంకటస్వామిని ఆమె ఆదేశించారు. దత్తివలస రెవెన్యూ పరిధిలో ఉన్న 17ప్రభుత్వ చెరువులు ఆక్రమణకు గురయ్యాయని, సాగు భూములుగా కొంతమంది భూస్వాములు అనుభవిస్తున్నారని గిరిజన సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. ఆక్రమణకు గురైన చెరువుల సరిహద్దులు నిర్ణయించి, ఆక్రమణదారులకు నోటీసులివ్వాలని ఆర్డీవో మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇది జరిగి నెలరోజులు కావస్తున్నా ఇంతవరకు విచారణ చేపట్టలేదు. గతంలో పని చేసిన విఆర్‌ఒల అండదండలతోనే భూస్వాములు ప్రభుత్వ చెరువులను ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి. మామిడిపల్లికి చెందిన కొంతమంది రైతులు ప్రభుత్వ చెరువులను ఆక్రమించారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ చెరువుల పరిరక్షించాల్సిన విఆర్‌ఒలే కబ్జాదారులకు అండగా నిలబడితే వాటి రక్షణ బాధ్యత ఎవరిదని స్థానిక గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. దత్తివలస సమీపంలో ఇటీవల వెలిసిన ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో కూడా ప్రభుత్వ చెరువు ఆక్రమణ జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక రెవెన్యూ అధికారుల ఉదాసీనత వల్లే చెరువుల కబ్జాలపై విచారణ ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. ఆర్‌డిఒ స్థాయి అధికారి ఆదేశాలనే కింద స్థాయి అధికారులు నిర్లక్ష్యం చేస్తే సామాన్యుల ఫిర్యాదులకు న్యాయం ఎలా జరుగుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బెలగాం జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

అమిత్ షా పర్యటనకు వ్యతిరేకంగా వామపక్షాల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విశాఖపట్నంలో పర్యటనకు వ్యతిరేకంగా ఆదివారం స్థానిక సుందరయ్య భవన్ వద్ద వామపక్షాలు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ బిజెపి రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిందని, ఏ మొఖం పెట్టుకొని అమిత్ షా విశాఖ పర్యటనకు వస్తున్నారని, ఈ పర్యటనను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విభజన సమయంలో రాష్ట్రానికి ఐదేళ్లు ప్రత్యేక హెూదా కాంగ్రెస్ ఇస్తామంటే బిజెపి పదేళ్లు కోరిందన్నారు. అలాగే ఉత్తరాంధ్ర, రాయల సీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని, పోర్టులు ఇస్తామని, గిరిజన యూనివర్సిటీ నిర్మిస్తామని, ఇలా అనేక హామీలు ఆనాడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఈ హామీలను 2014 ఎన్నికలకు ముందు అమలు చేస్తామని బిజెపి హామీ ఇచ్చిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు అమలు చేయలేదు సరికదా, విశాఖస్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించేందుకు పూనుకొన్న బిజెపి రాష్ట్రానికి మరింత ద్రోహం చేస్తుందన్నారు. మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ పెట్టుబడిదారులకు కారుచౌకగా అప్పచెప్పడానికి చూసే బిజెపిని రాష్ట్రంలో ఉన్న టిడిపి, వైసిపి, జనసేన కానీ ఒక్క మాట అనకపోగా ఎప్పుడు ఎన్నికలు వస్తాయా ఎప్పుడు బిజెపితో కలిసిపోదామా అని చూస్తున్నాయని అన్నారు. ఇంత ద్రోహం చేసిన బిజెపితో కలవడమంటే ఈ పార్టీలు కూడా రాష్ట్రానికి ద్రోహం చేయడమేన న్నారు. ఇప్పటికైనా ఈ పార్టీలు బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై స్పందించాలని, విభజన సమయంలో ఇచ్చిన హామీలు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా బిజెపి రాష్ట్రానికి చేస్తున్న ద్రోహాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించాలని, విభజన సమయంలో ఇచ్చిన హామీల కోసం పోరాడాలని, ఇందుకు సూచికగా అమిత్‌షా విశాఖ పర్యటనను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయుకులు కొల్లి గంగు నాయుడు, గొర్లి వెంకట రమణ, బి.సూరిబాబు, ఎం.ఉమామహేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జీవ, సూరయ్య, ప్రసాద్, సిపిఎం ఎల్ మన్యం జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.కాంతారావు, సిపిఐఎం ఎల్ జిల్లా అధ్యక్షులు ఎన్.హితలేశ్వర రావు, సభ్యులు డి. సూర్యనారాయణ పాల్గొన్నారు.

పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు (ఆర్ట్, వర్క్, పిజికల్ ఎడ్యుకేషన్) రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ లింగేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసే అభ్యర్థులు ఈ నెల 14 నుంచి 17 వరకు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. బదిలీ కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈ నెల 23న మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

మలేరియాతో ఇద్దరు మృతి

- శిమిలిగూడలో వైద్యం తీసుకుని విద్యార్థి
- మక్కువలో ప్రయివేటు వైద్యంతో మహిళ

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని గిరిశిఖర గ్రామ పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో గత రెండు రోజుల్లో ఇద్దరు గిరిజనులు మలేరియాతో మృత్యువాత పడ్డారు. చింతామల గ్రామానికి చెందిన మెల్లిక జాను (10) మలేరియా జ్వరానికి చికిత్స కోసం ఒడిశాలో శిమిలిగుడ ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ వైద్యం చేయించినా ఫలితం లేకపోవడంతో శనివారం మృతి చెందాడు. జాను మావుడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. అలాగే బందపాయి గ్రామానికి చెందిన చోడిపిల్లి తిమ్ములమ్మ (40) మలేరియా జ్వరానికి మక్కువలో ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్దనే ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కొదమ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఆరునెలలు కావస్తున్నా పనులు ప్రారంభం కాకపోవడంతో గిరిశిఖర గ్రామాల గిరిజనులు డోలీలో రోగులను మోసుకుని వెళ్లాల్సి వస్తోంది. రోడ్డు సౌకర్యం లేక వైద్య సిబ్బంది కూడా గ్రామాల్లో పర్యటించి గిరిజనుల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోలేక పోతున్నారు.

మృతి చెందిన జాన్

సిఆర్‌టిలందరినీ రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న సిఆర్‌టిలందర్నీ క్రమబద్ధీకరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక జిల్లా ఆసుపత్రి జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిఆర్‌టిలు పాలాభిషేకం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. మాట తప్పబోకు మడమ తిప్పబోకు' అంటూ నినాదాలు చేశారు. అనంతరం మురళీమోహనరావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకునిగా ఉన్నప్పుడు తన పాదయాత్రలో, మేనిపేస్టోలో కాంట్రాక్ట్ ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరిస్తానని హామీ ఇచ్చారని అన్నారు. కానీ ఇప్పుడు 2014 జూన్2 నాటి ఐదేళ్లు ఉన్న వారినే క్రమబద్ధీకరిస్తామని కేబినెట్ నిర్ణయం చేయడమంటే మాట తప్పడమేనని అన్నారు. ఈ కీలక నిర్ణయం వలన 15శాతం మంది మాత్రమే రెగ్యులర్ అవుతారని, మిగిలిన 85శాతం మంది ఉద్యోగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోని రావడానికి కాంట్రాక్టు ఉద్యో గులు కూడా కారణమేనని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్, నాయకులు భాస్కరరావు, సోములు, మురళి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందజేస్తున్న సిఆర్‌టిలు, యుటిఎఫ్ నాయకులు

బడి ఈడు పిల్లలను పాఠశాలలో ఉంచేందుకు కృషి

- జిల్లాను ప్రథమ స్థానంలో కొనసాగిస్తాం
- 96681 జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ
- 'ప్రజాశక్తి'తో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ ముఖాముఖి

జిల్లాలో బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండేలా జిల్లా విద్యాశాఖ కృషి చేస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ చెప్పారు. సోమవారం నుంచి పాఠశాలల పున: ప్రారంభం కానున్న దృష్ట్యా అన్ని స్కూళ్లలో మౌలిక వసతులతో సర్వం సన్నద్ధం చేశామని తెలిపారు. గత ఏడాదిలాగా ఈ విద్యా సంవత్సరం టెన్త్ ఫలితాల్లోనూ, విద్యాప్రమాణాల్లోనూ జిల్లా మొదటి స్థానంలోనే కొనసాగేలా పనిచేస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరం 96681 జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేస్తామని,విద్యా రంగానికి ప్రభుత్వం ఇస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. వీటితో పాటు జిల్లాలో విద్యారంగం అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను 'ప్రజాశక్తి' ముఖాముఖికి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే....

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో ఎన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి? ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు?

జిల్లాలో 1583 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో 1294 ప్రాథమిక పాఠశాలలు, 102 ప్రాథమికోన్నత, 187 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 49,388 మంది బాలికలు, 48373 మంది బాలురు చదువుతున్నారు. అలాగే 116 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, వీటిలో 26 ప్రాథమిక, 51 ప్రాథమికోన్నత, 39 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 9,658 మంది బాలికలు, 12,730మంది బాలురు చదువుతున్నారు.

జిల్లాకు ఎన్ని జగనన్న విద్యా కానుక కిట్లు వచ్చాయి?

జిల్లాకు 96681 జగనన్న విద్యా కానుక కిట్లు వచ్చాయి. వీటిని 15 మండలాలు పాయింట్లుగా 1583 పాఠశాలలుకు సరఫరా చేశాం. కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో పాయింట్లను ఇదివరకే జిల్లా కలెక్టర్ పరిశీలించి, సూచనలు కూడా అందించారు.

జిల్లాకు ఎన్ని పాఠ్య పుస్తకాలు అవసరం, ఎన్ని వచ్చాయి?

జిల్లాలో విద్యార్థులకు సరిపడా పుస్తకాలు సిద్ధం చేశాం. 9,01,706 పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

ఈ విద్యా సంవత్సర లక్ష్యం ఏమిటి?

గతేడాది మాదిరిగానే ఈ ఏడాదీ జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంచడం, బడి బయట పిల్లల సంఖ్యను సున్నా చేయడమే లక్ష్యంగా విద్యాశాఖ పనిచేయబోతుంది.

ఈ ఏడాది కొత్తగా ఎంత మంది విద్యార్థులు పాఠశాలలో చేరే అవకాశం ఉంది?

ఈ సంవత్సరం జిల్లాలో సుమారుగా 14,550 మంది విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉంది. ఇందు కోసం స్కూల్ రేడైన్స్ ప్రోగ్రాం ద్వారా పాఠశాల పునః ప్రారంభానికి ఒక పండగ వాతావరణంతో ఆయా ప్రాంత సంప్రదాయాలతో పిల్లలను పాఠశాలకు ఆహ్వానించడం, ఉపాధ్యాయులు నేరుగా పిల్లల ఇంటికి వెళ్లి ప్రభుత్వం ఇచ్చే పథకాలును వివరిస్తూ దగ్గరుండి పిల్లలను బడికి తీసుకురావడం వంటి కార్యక్రమాలు చేపట్టాం.

గిరిజన గ్రామాల్లో డ్రాపౌట్స్ ఎక్కువగా ఉంది? దీన్ని అధిగమించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రభుత్వం ఇచ్చే అమ్మవడి, జగనన్న విద్యా కానుక, జగన్నన గోరుముద్ద తదితర పథకాలను వివరిస్తూ దగ్గరుండి పిల్లలకు బడి, చదువుపై ఆశ కలిపించడం, టిఎఆర్ఎల్, సాల్ట్ కార్యక్రమాల ద్వారా నూతన బోధన అంశాలను వివరించడం, వారి కోసం ప్రత్యేకంగా ఎన్ఆర్ఎస్‌టిసి, సీజనల్ హాస్టళ్ల ప్రారంభించాం. వీటి కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు గతేడాది ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాం. ఈ ఏడాది కూడా అమలు చేస్తాం.

అనుమతుల్లేని ప్రైవేట్ పాఠశాలల పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలకు ప్రభుత్వం నుండి పాఠ్యపుస్తకాలు ఉండవు. అనుమతి ఉన్న పాఠశాలలకు మాత్రమే పుస్తకాలు వస్తాయి. ఈ ఏడాది నుంచి పాఠ్యపుస్తకాలు బయట దొరకవు. అంతేకాక ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే అటువంటి పాఠశాలను మూసివేయడం జరుగుతుంది.

వడగాలులతో తల్లడిల్లిన పార్వతీపురం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్/టౌన్

అధికఉష్ణోగ్రతలతో వేడెక్కిన వాతావరణంతో పాటు, వేడిగాలులతో కూడిన వడగాడ్పులతో ఆదివారం పార్వతీపురం మండలంతో పాటు, పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 7గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపించడం మొదలెట్టగా, వీటికి తోడు వేడుగాలులు వీయడం మొదలయ్యాయి. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణం చేస్తున్నవారు వేడిమిని తట్టకోలేక తల్లడిల్లిపోయారు. ఆదివారం పట్టణంలో 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ 48 డిగ్రీల తీవ్రత అనుభవించారు. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసి కాంప్లెక్స్, నుంచి కలెక్టర్ కార్యాలయం రహదారి మధ్యాహ్నం 12గంటలు దాటిన తర్వాత జనసంచారం లేక నిర్మానుష్యంగా ప్రధాన రహదారి మారింది. గత వారం రోజులు అధిక ఎండలకు శీతలపానీయాలు, పండ్లదుకాణాలను ఆశ్రయించిన పాదాచారులు, ఆదివారం వడగాడ్పులకు జడిసి ఎవరూ బయటకు రాలేదు. దీంతో జనసంచారం లేక సంబంధిత వ్యాపారాలు కూడా పెద్దగా కొనసాగలేదు. అయితే అత్యవసర ప్రయాణం చేసేవారు, తప్పనిసరిగా కార్యక్రమాలకు హాజరు అయ్యేవారు మాత్రం వేడివాతావరణం భరిస్తూ బయటకు రావడం కనిపించింది. ఇదే వడగాడ్పులు మరో రెండు రోజులు కొనసాగితే అధికంగా నష్టం జరిగే అవకాశం ఉందని వైద్యులు చెపుతున్నారు. ప్రజలు అవసరమైతే గాని బయటకు రాకూడదని, ఇళ్లలోకి వేడిగాలులు ప్రవేశించకుండా ద్వారాల దగ్గర పరదాలు ఏర్పాటు చేసుకోవాలని, వృద్ధులు, చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, డీహైడ్రేషన్‌కు గురికాకుండా, అడపాదడపా పంచాదార, ఉప్పు నీరు కలిపిన ద్రావణాన్ని సేవిస్తూ ఉండాలని సూచిస్తున్నారు. సోమవారం నుండి పాఠశాలలు పున: ప్రారంభమవుతున్న నేపథ్యంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఈనెల 17 వరకూ ప్రభుత్వం ఒంటిపూట బడులు ప్రకటించినా, వడగాడ్పులను దృష్టిలో ఉంచుకుని వారంలో రోజుల పాటు బడులకు సెలవులు ప్రకటించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

నిర్మానుష్యమైన కలెక్టరేట్ కూడలి

ఫిల్లర్ల పనులు పూర్తయిన సాగిగెడ్డ కల్వర్టు

జోరుగా సాకిగెడ్డ కల్వర్టు నిర్మాణ పనులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని తాళ్లబురిడి- చప్పవానివలస మధ్య సాకిగెడ్డపై ఉన్న కల్వర్టు గత వర్షాకాలంలో సంభవించిన వరదలకు కొట్టుకుపోవడంతో సుమారు 50కు పైగా గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అయితే లచ్చిరాజుపేట నుంచి వెంగళవలస వరకూ రహదారి నిర్మాణంలో భాగంగా అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ నిధులు రూ.126.85లక్షలతో దాదాపు 2.6 కిలోమీటర్ల బిటి రోడ్ నిర్మాణం జరుగుతుంది. దీనిలో భాగం కల్వర్టు పనులు ముందుగా ప్రారంభించాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధికారులను కోరడంతో కల్వర్టు నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఫిల్లర్ల నిర్మాణం పూర్తికావడంతో త్వరలోనే శ్లాబు పనులు పూర్తి చేసి ఈ వర్షాకాలం ప్రారంభంలోనే కల్వర్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ములగ, దోకిశిల, కవిటిభద్ర, వెంగళవలస పంచాయతీ పరిధిలోని గ్రామాలతో పాటు సరిహద్దు ఒడిషా గ్రామ ప్రజలు ఈ వంతెన నిర్మాణం వలన రహదారి ఇబ్బందులకు తెరపడనున్నందుకు సంతోషిస్తున్నారు.

వారాహి యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పాలకొండ

జనసేన అధినేత కొణిదల పవన్‌కల్యాణ్ ఈనెల 14న ప్రారంభించబోయే వారాహి యాత్ర దిగ్విజయంగా సాగాలని స్థానిక జనసేన నాయకులు ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏ విధమైన ఆటంకాలు, అడ్డంకులు జరగకుండా ఉండాలని వైసిపి దుష్టశక్తి పాలన పోవాలని, ప్రజలకు మళ్లీ రామరాజ్యం లాంటి రాజ్యాధికార పాలన వచ్చేలా పవన్ కళ్యాణ్ చేపట్టిన వారాహి యాత్రను దిగ్విజయంగా కొనసాగించాలని నియోజకవర్గంలో ఉన్న జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కోటదుర్గ అమ్మవారి ఆలయంలో వారాహి యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన పాలకొండ నియోజకవర్గ నాయకులు జబ్బు సోంబాబు, ప్రశాంత్, రమేష్, అనిల్, రమేష్, గోవిందరావు, చిన్న రాయుడు, గణేష్, రాజేష్, వేణు, ప్రసాద్, ప్రేమ్ కుమార్, లోకేష్, ఉమ, దుర్గ ప్రసాద్, భాస్కర్ తదితర జనసైనికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పాఠశాలలకు తరలిస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లు

జగనన్న విద్యాకానుకలు సిద్ధం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలో గల 115 పాఠశాలల్లో సోమవారం స్కూళ్ల పున:ప్రారంభానికే విద్యార్థుల కోసం జగనన్న విద్యాకానుకలు సిద్ధం చేసినట్లు ఎంఇఒ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 115 పాఠశాలల పరిధిలోని 9170 మంది విద్యార్థులకు అందించేందుకు 9169 యూనిఫాంలు, 56474 పాఠ్యపుస్తకాలు, 69580 నోట్‌పుస్తకాలు, 1035 డిక్షనరీలు, 9170 బ్యాగులు, 629 పిక్చోరియల్స్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా షూలు, సాక్స్‌లు రావాల్సి ఉన్నాయని, ఈనెల 17 వరకు ఒంటిపూట బడులు ఉన్న కారణంగా ఈనెల 19నాటికి వాటిని కూడా విద్యార్థులు అందిస్తామని తెలిపారు.

మైసూర్ కవితా గోష్టికి దేవానంద్ ఎంపిక

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న తెలుగు, కన్నడ కవిత గోష్టికి గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన పాలక దేవానంద్ ఎంపికయ్యారు. ఈ మేరకు గుమ్మ లక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతం నుంచి శ్రీ శ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆహ్వానించారు. దేవానంద్ గుమ్మ లక్ష్మీపురం మండలం మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు సాహిత్యంలో తనదైన శైలిలో రాణిస్తూ ఇప్పటికే పలు అవార్డులు, సొంతం చేసుకున్నారు. కవితా గోష్టి కార్యక్రమానికి దేవానంద్ ఎంపిక కావడం పట్ల స్నేహితులు గ్రామస్తులు అభినందించారు.

సెలవులు మరో 10 రోజులు పెంచాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జూన్ నెల వచ్చినా ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో వేసవి సెలవులు మరో 10 రోజులు పెంచాలని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి ప్రభుత్వాన్ని కోరారు. ప్రతిరోజు కనీసం 42 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో విద్యార్థులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పాఠశాలల్లో ఫ్యాన్స్ కూడా లేని పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఒంటి పూట బడులు అనే జీవో జారీ చేసిందన్నారు. ఉదయం 10 గంటలకేసుమారు 42 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండడం వల్ల పిల్లలు ఎలా తట్టుకోగలరని ఆమె ప్రశ్నించారు.

ప్రజా సమస్యలపై పోరు బాట

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రజా సమస్యలపై పోరు చేయాలని జనసేన నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు స్థానిక జనసేన కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీస్థితిగతులు, ప్రజాదరణ తదితర వాటిపై చర్చించారు. అంతరం ప్రజా సమస్యలపై పోరు చేయాలని నిర్ణయించారు. జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఈనెల 14 నుంచి చేపట్టనున్న వారాహి యాత్ర గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలోచందక అనిల్ కుమార్, గొర్లి చంటి, వంగల దాలినాయుడు, రాజాన రాంబాబు, పాటి శ్రీనివాసరావు, ఆగూరుమణీ, బోనెల గోవిందమ్మ, పైలా సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పర్యాటకులు పార్కుకు తరలివచ్చారు. పార్కులోని అందాలను ఆశ్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెరలు కొట్టారు. ఆల్ట్రా వెహికల్‌తో పార్క్ చుట్టుముట్టారు. చిన్నారులు మినీ ట్రైను వద్ద ఆడుకున్నారు. జెయింట్ వీల్ ఎక్కి ఉయ్యాల ఊగారు. ఆనంద్ విహార్ వద్ద ఉల్లాసంగా ఉత్సాహంతో డాన్సులు వేశారు. అనంతరం మెట్టిగూడ జలపాతాన్ని సందర్శించారు.

హ్యాంగింగ్ బ్రిడ్జి నడుస్తున్న పర్యాటకులు

ఇళ్లు ఇచ్చేదెప్పుడో..?

టిడ్కో లబ్ధిదారుల ఎదురుచూపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

టిడ్కో ఇళ్ల కోసం పట్టణంలోని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.500, రూ.12,500, రూ.25వేలు చొప్పున లబ్ధిదారులు స్థానిక మున్సిపల్ కమిషనర్ పేరుతో బ్యాంకులో డిడీలు చెల్లించారు. గత ప్రభుత్వ హయాంలో స్థల సేకరణలో జాప్యం కారణంగా ఇళ్ల నిర్మాణ పనులు పునాదుల దశలోనే నిలిచిపోయాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో రూ.500 చెల్లించిన లబ్ధిదారులకు మాత్రమే ఒక్క రూపాయికే ఈ ఇళ్లను ఇచ్చేందుకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ముందుకొచ్చింది. రూ.12,500, రూ.25,000 చెల్లించిన లబ్ధిదారులకు జగనన్న లేఔట్‌లో స్థలాలు ఇచ్చి, వారు చెల్లించిన డబ్బులను ప్రభుత్వం చెల్లిస్తుందే దిశగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు చొరవతో ఇళ్ల నిర్మాణానికి పాత కాంట్రాక్టర్‌ను రద్దుచేసి కొత్త కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించారు. పార్వతీపురం మండలం అడ్డాపుశీల వద్ద 768 మంది లబ్ధిదారులకు 16 బ్లాక్‌ల్లో నిర్మాణాలు చేపట్టగా 11 బ్లాక్‌ల్లో 684 మంది లబ్ధిదారులకు సంబంధించిన నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే విద్యుత్, ప్లంబింగ్, టైల్స్, కలర్స్ పనులు చేయాల్సి ఉంది. మిగిలిన ఆరు బ్లాకుల్లో 84 నిర్మాణాలు సగం వరకే జరిగి సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశారు. నిర్మాణాలు పూర్తికావచ్చినప్పటికీ సిసి రోడ్లు, వాటర్ ట్యాంకు నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదు. ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను మున్సిపల్ అధికారులు దాదాపు పూర్తి చేశారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులో జాప్యం కారణంగానే పనులు నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఉగాది నాటికి ఇళ్లు పూర్తి చేసి గృహప్రవేశాలు చేస్తామని సంబంధిత అధికారులు తెలపడంతో లబ్ధిదారులు ఎంతో ఆశతో ఎదురు చేశారు. కళ్లు కాయలు కాసేలా ఎదురుచూపులే మిగిలాయి. ఈ విషయంపై లబ్ధిదారులు మున్సిపల్ కమిషనర్‌ను అడిగితే ఆగస్టు నాటికి పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే, టిట్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ దృష్టిసారించి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, లబ్ధిదారులు కోరుతున్నారు.

అసంపూర్తిగా ఉన్న టిట్కో ఇళ్ల సముదాయం

కొండెక్కిన కోడి

కిలో చికెన్ రూ.300

ప్రజాశక్తి - కురుపాం

సామాన్యుడి అందుబాటులో లేని విధంగా కోడి మాంసం ధరలు అమాంతంగా పెరిగాయి. చాలా కాలం తర్వాత ఊహించని విధంగా కోడి ధర కొండెక్కింది. ప్రస్తుతం బ్రాయిలర్ కోడి మాంసం కిలో రూ.300 దాటింది. లైవ్ ధర రూ.170 కు చేరింది. చాలా కాలం తర్వాత ఇంత భారీ స్థాయిలో ధరలు పెరగడం ఇదే మొదటిసారి. దీంతో సామాన్యులు కోడి మాంసం తినే పరిస్థితి కరువైంది. సుమారు ఐదు నెలల కిందట కోడి ధరలు అమాంతం పడిపోయాయి. రూ.100లోపే కిలో లైవ్ ధర వుండేది. దీంతో పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోయి లబో దిబోమన్నారు. సొంతంగా కోళ్లను పెంచి విక్రయించే రైతులు లక్షల్లో నష్ట పోయారు. కంపెనీల ద్వారా పౌల్ట్రీలు నడిపే రైతులు సైతం రేట్ ఇన్సెంటివ్ లేక నష్ట పోవాల్సి వచ్చింది. అప్పట్లో పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడింది. కార్తీక మాసంలో అనేక మంది నాన్ వెజ్ తినరు. ఆ సమయంలో కోడి మాంసం ధరలు కొంచం తక్కువగా వుండడం సహజం. కార్తీక మాసంలో ఉన్న ధరలు కంటే, ఆ తర్వాత ధరలు ఇంకా తగ్గడం వెనుక పౌల్ట్రీ కార్పొరేట్ శక్తులు మాయాజాలమే అని పౌల్ట్రీ రైతులు అవేదన చెందారు.

ప్రస్తుత ధరలు బట్టి రైతులకు మంచి లాభాలు రావడం సహజమే. అయినా, ఇంత భారీ స్థాయిలో కోడి ధర పెరగడం అనూహ్యామే. పెరిగిన భారీ ధరలతో సామాన్యులకు ఆర్థిక భారం తప్పదు. వివాహాలు, ఇతర కార్యక్రమాల్లో నాన్ వెజ్ ఏర్పాటు చేసేవారికి మాత్రం అదనపు భారం తప్పదు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

కూనేరుకు నైట్ హాల్ట్ బస్సు నడపాలి

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి కూనేరు వరకు నైట్ హాల్ట్ బస్సు నడపాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ పార్వతీపురం నుండి కొమరాడ మీదుగా కూనేరు వరకు నైట్ హాల్ట్ బస్సును వెంటనే పునరుద్ధరించాలని కోరారు. గడిచిన రెండేళ్లలో కరోనా కారణంతో ఈ బస్సు సర్వీసును నిలిపివేశారని, మళ్లీ కరోనా వైరస్ తగ్గుముఖం పట్టిన వేళ కొన్ని రూట్లో నైట్ హాల్ట్ బస్సును పునరుద్ధరించినా కూనేరుకు నడపలేదని అన్నారు. ఈ బస్సు సర్వీసు వల్ల మండలంలో సుమారు 31 పంచాయతీలకు సంబంధించి ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుందన్నారు. పార్వతీపురం నుండి కొమరాడ మీదుగా కూనేరు వరకు నైట్ హాల్ట్ బస్సు ఉండడం వల్ల విజయనగరం, విశాఖ, ఇతర ప్రాంతాల నుంచి వారికి చాలా ఉపయోగంగా ఉండేదన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే ఐటిడిఎ పిఒను, పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కోరామన్నారు. తక్షణమే కూనేరు నైట్ హాల్ట్ బస్సులు వెంటనే పునరుద్ధరించి ప్రయాణికులను ఆదుకోవాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు హిమరిక లక్ష్ము, భవన నిర్మాణ నాయకులు గౌరునాయుడు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో అంశాలను ప్రతి ఒక్కరికీ తెలపాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాజమండ్రిలో జరిగిన మహానాడులో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాబోయే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ, రైతు, మహిళా మొదలగు వర్గాల ప్రజలకు ఇవ్వబోయే పథకాల గురించి ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ క్లస్టర్, బూత్ ఇంచార్జీలు వివరించాలని టిడిపి సాలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన మండల స్థాయి క్లస్టర్, బూత్ ఇంచార్జీల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమం మచ్చుకైనా కనిపించలేదని, ప్రభుత్వం చేస్తున్న అన్యాయం, అక్రమాలు, తప్పుడు కేసులు గురించి, గతంలో ఉన్న నిత్యావసరాల ధరలు నేడు వాటి ధరలు గురుంచి ప్రజలకు వివరించాలని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు భారీగా పెంచి, కోతలతో ప్రజలను బెంబేలు ఎత్తిస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం టిడిపి సానుభూతి పరుల ఓటర్లను జాబితా నుండి ఎటువంటి నోటీస్ లు ఇవ్వకుండా తొలగిస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి అక్రమాలు జరగకుండా క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జీలు అప్రమత్తంగా ఉండి హౌజ్ వెరిఫికేషన్, హౌస్ లోకేషన్స్, మ్యాపింగ్‌లను బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో శ్యామ్, భాస్కరరావు, టి.తిరుపతిరావు, కె.వెంకట రమణ, సత్యం, యుగంధర్, బాలాజీ, కరిభుగత భాస్కర రావు, వెంకట, కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అవగాహనకు జాగృతి యాత్రలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా, ఫోక్సో దిశ చట్టాలపై అవగాహన కల్పించేందుకు త్వరలో జాగృతి యాత్రలు నిర్వహిస్తున్నట్లు పాలకొండ డిఎస్‌పి కృష్ణారావు వెల్లడించారు. ఆదివారం గుమ్మలక్ష్మీపురం వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే ఈ అంశాలపై మారుమూల గ్రామాల్లో తమ శాఖ ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలలు ప్రారంభం కానున్న దృష్ట్యా వాటితో పాటు పాఠశాలల్లోని 18 ఏళ్ల వయసు గల విద్యార్థులకు ఈ చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించేలా ఈ జాగృతి యాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల కొన్నిచోట్ల అనర్థాలు జరుగుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని సదస్సులు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు, తయారీ నిషేధించామన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎస్‌పి కృష్ణారావు

కొత్త జిల్లాల విభజన తర్వాత క్రైమ్ రేట్ చాలా వరకు తగ్గుముఖం పట్టిందని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిత్యం అమలులో ఉంటుందని అందులో భాగంగా యువకులను ప్రోత్సహించేందుకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిఐ సత్యనారాయణ, ఎస్ఐ షణ్ముఖరావు ఉన్నారు.

వివాదంలో ఉన్న త్రినాథ స్వామి దేవాలయాన్ని పరిశీలించిన డి.ఎస్.పి

ఇటీవల గుమ్మ లక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ లో ఉన్న త్రినాధ స్వామి దేవాలయ వివాదం గురించి అందరికీ తెలిసిందే. ఇందులో భాగంగా డిఎస్‌పి ఆలయ పరిసరాలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఆలయం ఎవరికి ఆటంకంగా లేదని సుమారు 30 ఏళ్ల నుంచి ఆ ప్రదేశంలో ఉందని స్థానిక పెద్దలు గ్రామస్తులు తెలియజేశారు. స్థానికుల మనోభావాలను అర్థం చేసుకొని దేవాలయాన్ని ఉంచాలని కోరారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమాలు గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్. సోమేశ్వరరావు, ఎస్సీ ఎస్టీ సంఘ నాయకులు నూతలపాటి భరత భూషణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని విద్యార్థులు అందరూ బాగా చదువుకుని ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో చిత్రలేఖనం, వ్యాసరచన, మట్టి బొమ్మలు తయారీ, పర్యావరణం, డ్రాయింగ్ పోటీల్లో విజేతలు అయిన భరత్, నవ్య, లోహిత్, యశస్విని, సాయి ప్రణీత, వరుణ్, హారిక బి.సాహితీకి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా యోగా గురువు కె.జనార్ధనరావు, ఫ్యాషన్ డిజైనర్ కలా అంకురం డైరెక్టర్ అల్లు ప్రియాంక, డ్రాయింగ్ మాస్టర్ జి.మురళిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతులను పెదబోగిలి ఉప సర్పంచ్ కె.అరవింద్‌కుమార్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలతోనే విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. వేసవిలో పిల్లలు ఆటలకే పరిమితం కాకుండా ఇలాంటి శిక్షణా కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఉపయోగమన్నారు. ఈ శిక్షణలో వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బి.వెంకటరావు, వార్డుసభ్యులు పి.రామారావు, బి.రామరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సీతానగరం : విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఉపసర్పంచ్

గుమ్మలక్ష్మీపురం: వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ శిబిరాలకు విద్యార్థులు ప్రతి రోజు వచ్చి మంచి మంచి విషయాలను తెలుసుకోవడం ద్వారా తమ మేధాశక్తి పెంపొందించుకోవడం సంతోషకరమని గ్రంథాలయ నిర్వహణ అధికారి డోనక సుకన్య తెలిపారు. విద్యార్థులకు చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్ వంటి సజనాత్మక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మండు వేసవిలో విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి నేర్చుకోవడం అభినందనీయమని అన్నారు. ముగింపు శిబిరాల్లో ఉపాధ్యాయులు పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు.

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

ఎంతోమంది అధికారులకు విన్నవించారు.... ఎన్నో ఏళ్లుగా ఎదురు చూశారు. స్పందించకపోవడంతో చివరకు చేసేది లేక తమ గ్రామాలకు రోడ్డును తామే వేసుకోవాలని నిర్ణయించుకున్నారు... శ్రమదానంతో గ్రామ రహదారులను నిర్మిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏజెన్సీలో ఒక గ్రామాన్ని చూసి మరొక గ్రామం ప్రజలు శ్రమదానం చేసి గ్రామాల రహదారులను బాగు చేసుకుంటున్నారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు తాగడానికి కనీసం నీటి చుక్క కూడా దొరకని పరిస్థితి. మరోవైపు వైద్యం అందని ద్రాక్షల మారింది. ఇటువంటి తరుణంలో గ్రామ రహదారులను అభివృద్ధి చేసి కనీస మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావాలని భావించారు. ఇందులో భాగంగా మండలంలోని వంగర పంచాయతీ మర్రిగూడ, లుంబేసు పంచాయతీ వాడబాయి గ్రామాల గిరిజనులు శ్రమదానంతో రోడ్లు వేసుకుని శభాష్ అనిపించుకున్నారు. గ్రామస్తులంతా ఐక్యతతో మట్టిని తవ్వి ఐదు కిలోమీటర్లు రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. పిల్లల నుంచి పెద్దలు వరకూ రోడ్డు నిర్మాణంలో భాగస్వామ్యం అయ్యారు. వీళ్ల పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఐక్యత చాటుతున్న గిరిజనులు

శ్రమదానంతో రోడ్డు పనులు చేస్తున్న గిరిజనులు

స్వయంగా నిర్మిస్తున్నాం.......

ఎన్నోసార్లు ఎంతో మంది అధికారులకు గ్రామ రహదారిని అభివృద్ధి చేయాలని విన్నవించుకున్నా స్పందించ లేదు. చివరికి చేసేది లేక గ్రామస్తులంతా ఏకమై రహదారి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

తోయక లక్ష్మమ్మ
గిరిజన మహిళ వాడబాయి.

శ్రమదానంతో రహదారి...

మా బాధలను ఎవరికి చెప్పుకున్నా స్పందించే వారే కరువయ్యారు. గ్రామానికి రహదారి లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. శ్రమదానం చేసి అధ్వానంగా ఉన్న రహదారిపై మట్టి వేసి చదును చేస్తున్నాం.

మండంగి భీమారావు
గిరిజనుడు వాడబాయి గ్రామం.

విద్యుత్తు కోతలు... తప్పని తిప్పలు

ప్రజాశక్తి-పాలకొండ

ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఉక్కపోత విపరీతంగా ఉంది. ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయితే పాలకొండలో మాత్రం విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. అడుగడుగునా సాంకేతిక సమస్యలతో ప్రజలకు కష్టాలు ఎదురవుతున్నాయి. రాత్రి వేళల్లో కూడా కొన్ని ప్రాంతాల్లో సాంకేతిక కారణాలతో విద్యుత్ నిలిపి వేచేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య ఉంది. మొగిలివీధి, మేదరవీధి తదితర ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య ఎక్కువుగా ఉంది. రాత్రి 10 గంటల తరువాత విద్యుత్ సరఫరాలో నాణ్యత లేకపోవడంతో ఫ్యాన్లు తిరగక ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. దీనిని పట్టించుకోవాల్సిన విద్యుత్ శాఖాధికారులు కనీసం దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా తంపటాపల్లిలో కూడా లోఓల్టేజీ సమస్య కొంత కాలంగా ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ శాఖాధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- బొబ్బిలి

పచ్చదనంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి అన్నారు. స్థానిక గాయత్రి జూనియర్ కళాశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణకు ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ బెల్ట్ సొసైటీ పని చేస్తుందన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు
పార్వతీపురం.
I.A.425/2018, I.A.426/2018,
I.A.427/2018 IN O.S.7/2015.
Between
గౌరజాన పద్మావతి ...వాది
And
ఆరెవెల్లి సుబ్బారావ్ (డైడ్) అండ్ 5అదర్స్.
...ప్రతివాది

పై దావా లో 4వ ప్రతివాది అయిన శ్రీమతి ఆరవల్లి సుధారాణి డాటర్ ఆఫ్ లేట్ సుబ్బారావ్, సింహాచలం, విశాఖపట్నం, వారికి ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియ జేయునది ఏమనగా, పై దావాలో మీకు పలుమార్లు కోర్టు ద్వారా summons పంపినప్పటికి, మీరు ఉద్దేశ పూర్వకముగా సదరు summonsను పుచ్చు కోకుండా కాలయాపన చేసియున్నారు. కావున శ్రీ కోర్టు వారి అనుమతి తో ఈ ప్రకటన ద్వారా తెలియ జేయునది ఏమనగా పై దావా తదుపరి విచారణకు **19-06-2023 తేదీ** కి వాయిదా వేయడమైనది. కావున సదరు తేదీ నాటికి మీరు గాని, మీ తరుపున వకీలు గాని హాజరు అయి మీ వాదనను శ్రీ కోర్టు వారికి వినిపించు కోగలరు. లేని పక్షములో, మీ పరోక్షములో పై దావాలో విచారణ చేయగలరాని ఇందు మూలముగా తెలియ జేయడమైనది.

ఇట్లు
A.T.R.Patnaik, B.Com., B.L...
Advocate, Parvatipuram.
Cell No.9866030124.

నేరాలు ఘోరాలు

కడుపునొప్పి తాళలేక వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సీతానగరం మండలం బళ్లకృష్ణాపురానికి చెందిన కొల్లి నారాయణమ్మ చాలా కాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. అయితే గడిచిన వారంరోజులుగా ఈ వ్యాధి తీవ్రంగా మారి, కడుపునొప్పి భరించలేనంతగా మారడంతో ఆదివారం ఇంటో ఉన్న చీమలమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు జిల్లా అసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

పార్వతీపురం రూరల్: మండలంలోని బుదురువాడ పంచాయతీ టొంకి గ్రామానికి చెందిన కర్ర నారాయణరావు టైల్స్ పనిచేస్తుంటాడు. సోమవారం పెదమరికిలో పనిచేసేందుకు తన ద్విచక్ర వాహనంపై పెదబొండపల్లి మీదుగా ఎమ్మార్‌నగరం వైపు వెళ్తుండగా, అదే రహదారిలో ఎదురుగా వస్తున్న ఎమ్మార్ నగరంకు చెందిన గండి అప్పలనాయుడు తన ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు జిల్లా అసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

1704 లీటర్ల సారా ధ్వంసం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎల్విన్‌పేట సిఐ ఎల్విన్‌పేట, కురుపాం, నీలకంఠాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల స్వాధీనం చేసుకున్న 1704.6 లీటర్ల నాటు సారా ను పాలకొండ డి.ఎస్.పి కష్ణారావు ఆధ్వర్యంలో మండలంలోని జెకెపాడు గ్రామ సమీపంలో ఆదివారం ధ్వంసం చేశారు.ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో 239.5 మీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకోగా 18కేసులు, కురుపాం పోలీస్ స్టేషన్ పరిధిలో 1292.1 లీటర్ల నాటసారా స్వాధీనం చేసుకోగా 11కేసులు, నీలకంఠాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 173 లీటర్లు నాటు సారా పట్టుబడగా 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్విన్ పేట, నీలకంఠాపురం ఎస్ఐ లు షణ్ముఖరావు,అనిల్ కుమార్, సిబ్బంది ఉన్నారు.